

దోమల నివారణకు చర్యలు చేపట్టాలని నిరసన

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

జిల్లాలో దోమల నివారణకు చర్యలు చేపట్టి డెంగీ, ఇతర జ్వరాల నివారణకు కృషి చేయాలని కోరుతూ స్థానిక అంబేద్కర్ కాలనీ వద్ద గురువారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ మాట్లాడుతూ దళితుల నివాస ప్రాంతాల్లో డ్రెయినేజీలు శుభ్రం చేయాలని, బ్లీచింగ్ చల్లించాలని కోరారు. ప్రతి ఇంటికీ దోమతెరలు పంపిణీ చేయాలని, ఓవర్ హెడ్ ట్యాంకులను శుభ్రం చేయించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డేవిడ్ రాజు, నున్న సుబ్బారావు, ఒగ్గు మేరీ, బి.దుర్గ, ఎన్.సీత తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న కెవిపిఎస్ నాయకులు

ఇ-క్రాప్‌పై.. స్పష్టత ఏదీ..!

- ఖరీఫ్ సాగు ప్రారంభమైనా మొదలుకాని ఇ-క్రాప్ నమోదు
- రెండు జిల్లాల్లో దాదాపు ఐదు లక్షల ఎకరాల్లో పంటల సాగు
- పంట నష్టపరిహారం నుంచి బీమా వరకూ అన్నింటికీ ఇ-క్రాప్‌నే ఆధారం
- కౌలురైతుల పేర్లు నమోదుపైనా స్పష్టతివ్వని ప్రభుత్వం
- సాగు చేసే రైతులకు న్యాయం జరిగేనా..?



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఖరీఫ్ సాగు ఆరంభమై నెలలు గడిచిపోతున్నా రెండు జిల్లాల్లో ఇప్పటికీ ఇ-క్రాప్ నమోదు ప్రక్రియ ప్రారంభం కాని పరిస్థితి నెలకొంది. కొత్త ప్రభుత్వం ఇ-క్రాప్ నమోదుకు సంబంధించి ఎటువంటి స్పష్టత ఇవ్వకపోవడం రైతుల్లో చర్చనీయాంశంగా మారింది. పంట రుణాల నుంచి దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం, బీమా, ధాన్యం విక్రయం వంటి అనేక ఇ-క్రాప్ ఆధారంగానే జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇ-క్రాప్ నమోదుపై ప్రభుత్వం మౌనంగా ఉండటం గమనార్హం. ఖరీఫ్‌లో ఏలూరు జిల్లావ్యాప్తంగా 2.60 లక్షల ఎకరాల్లో వివిధ పంటలను రైతులు సాగు చేస్తున్నారు. దీనిలో 2.20 లక్షల ఎకరాల్లో వరి, మిగిలింది మొక్కజొన్న, మినుము, పత్తి వంటి సాగు ఉంది. పశ్చిమగోదావరి జిల్లాలో దాదాపు 2.50 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతుండగా 2.15 లక్షల ఎకరాల్లో వరి, మిగిలినవి ఇతర పంటలు ఉన్నాయి. ఇ-క్రాప్ నమోదులో వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి ఆ భూమిలో ఏ పంట సాగు చేస్తున్నారో గుర్తించి, రైతు పేరుతో సహా ఇ-క్రాప్ సైట్‌లో నమోదు చేయాలి. దీని ఆధారంగానే బ్యాంకులు పంట రుణాల మంజూరు నుంచి ప్రభుత్వం రైతులకు అందించే ప్రతిసాయమూ వర్తిస్తోంది. టిడిపి కూటమి అధికారంలోకి వచ్చి నెలరోజులు గడిచింది. రెండు జిల్లాల్లోనూ ఖరీఫ్ నారుమడులు పూర్తయ్యి నాట్లు సాగుతున్నాయి. రెండు జిల్లాల్లో దాదాపు పది వేల ఎకరాల్లో నాట్లు సైతం పడ్డాయి. రైతులు పంట రుణాల కోసం బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. ఇప్పటికే ఇ-క్రాప్ నమోదు మాత్రం ప్రారంభం కాకపోవడంతో రైతులకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది. ఇ-క్రాప్ నమోదు జరగకపోతే పండించిన పంటను సైతం విక్రయించలేని దుస్థితి రానుండటంతో రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ఇ-క్రాప్ నమోదుపై ఏలూరు జిల్లావ్యవసాయశాఖ జెడి హబీబ్‌భాషాను వివరణ కోరగా కొద్ది రోజుల్లోనే ప్రారంభమవుతుందని తెలిపారు.

కౌలురైతుల పేర్లు నమోదుపై స్పష్టత ఏది..?

నిబంధనల ప్రకారం క్షేత్రస్థాయిలో సాగు చేస్తున్న రైతుల పేర్లు, పంటల వివరాలను ఇ-క్రాప్‌లో నమోదు చేయాలి. గత ప్రభుత్వం దీన్ని పూర్తిగా తుంగలో తొక్కేసింది. సాగు చేస్తున్న కౌలురైతుల పేర్లు కాకుండా సాగు చేయని భూయజమానుల పేర్లు ఇ-క్రాప్‌లో నమోదు చేయించింది. వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయికి వెళ్లకుండానే కార్యాలయాల్లోనే ఈ పని ముగించేశారని విమర్శలు సైతం ఉన్నాయి. రెండు జిల్లాల్లో మూడు లక్ష మంది వరకూ కౌలురైతులు ఉన్నారు. రెండు జిల్లాల వ్యవసాయం సాగులో 70 శాతానికిపైగా వీరే చేస్తున్నారు. సాగు చేస్తున్న కౌలు రైతులందరికీ కౌలుకార్డులు జారీ చేసి ఇ-క్రాప్‌లో నమోదు చేయాల్సి ఉంది. 2014-19 మధ్య టిడిపి ప్రభుత్వంలో ఇది కొంతమేర సాగింది. వైసిపి ప్రభుత్వం వచ్చాక కౌలుచట్టంలో మార్పులు చేసి సాగుదారులను పూర్తిగా పక్కన పెట్టేసిన పరిస్థితి కొనసాగింది. దీంతో పండించిన పంటను సైతం కౌలుదారులు అమ్ముకోలేని దుస్థితి ఏర్పడింది. కొత్త ప్రభుత్వం రావడంతో కౌలురైతులకు న్యాయం చేస్తుందని ఆశతో సాగుదారులు ఎదురుచూస్తున్నారు. వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సాగు చేస్తున్న కౌలురైతుల పేర్లను ఇ-క్రాప్‌లో నమోదు చేయాలని రైతులు, రైతుసంఘాలు కోరుతున్నారు. కౌలుకార్డుల జారీ ప్రక్రియ రెండు జిల్లాల్లోనూ మందకొడిగా సాగుతుండటంతో ఈ ప్రభుత్వం కూడా కౌలురైతులకు అన్యాయం చేస్తుందా అనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇ-క్రాప్ నమోదులో కౌలురైతుల పేర్లు నమోదు చేసేలా ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాల్సి ఉంది. అంతేకాకుండా కౌలుచట్టంలో మార్పులు చేసి కౌలురైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సాగుదారులు కోరుతున్నారు. ప్రభుత్వం ఏవిధంగా ముందుకు సాగుతుందో వేచిచూడాలి.

ధరల భారం నుంచి ఉపశమనం

రాయితీపై సరుకులు అందించే కౌంటర్ ప్రారంభంలో మంత్రి పార్థసారధి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

రాష్ట్ర ప్రభుత్వం బియ్యం, కందిపప్పులను తక్కువ ధరకు విక్రయించేందుకు స్థానిక రైతుబజార్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌ను మంత్రి కొలుసు పార్థసారధి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నూజివీడు ఆర్‌డిఒ, ఇతర అధికారులతో కలిసి బియ్యం, కందిపప్పును మంత్రి వినియోగదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రికి రైతుబజార్లో ఉన్న సమస్యలను నిర్వాహకులు వివరించారు. ప్రయివేటు మార్కెట్ ఉండటం వల్ల తమకు రైతులు కూరగాయలను ఇవ్వడం లేదని, అలాగే రైతుబజార్‌ను అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. దీనిపై మంత్రి స్పందిస్తూ త్వరలో అన్ని సమస్యలకు పరిష్కారం చూపిస్తానన్నారు. రైతుబజార్లో ప్రత్యేక షెడ్లు వేయించి పూర్తి సౌకర్యాలు ప్రజలకు ఉండేలా చేసి విక్రయదారులకు ఇబ్బంది లేకుండా చూస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ ప్రత్యేక కౌంటర్లలో బియ్యం, కందిపప్పు అమ్మకం వల్ల ధరల భారం నుంచి ఉపశమనం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ కందుల సత్యనారాయణ, అధికారులు, టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


కౌంటర్ ప్రారంభిస్తున్న మంత్రి పార్థసారధి


కౌంటర్ ప్రారంభిస్తున్న ఎంపీ మహేష్

ప్రజల అవసరాలు తీర్చేందుకు కృషి : ఎంపీ మహేష్

ఏలూరు అర్బన్ :టిడిపి కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అన్ని రకాల ప్రజా అవసరాలు తీర్చుకుంటూ ముందుకు వెళ్తుందని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ అన్నారు. స్థానిక పత్తేబాద రైతుబజార్‌లో బియ్యం, కందిపప్పు రాయితీపై ఇచ్చేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లను ఆయన జెసి లావణ్యవేణి, ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి, దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్‌తో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మహేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో పలు ప్రాంతాల్లోని రైతు బజార్లలో కందిపప్పు, బియ్యం రాయితీపై విక్రయించేందుకు ఆరు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.త్వరలోనే అన్నా క్యాంటీన్ ద్వారా ఆహారాన్ని అందించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి, దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు నాయుడు సోము, సివిల్ సప్లైయిస్ డిఎం మంజూభార్గవి, జిల్లా పౌర సరఫరా అధికారి ఎస్-ఎస్.సత్యనారాయణరాజు, ఏలూరు ఆర్‌డిఒ ఎన్ఎస్‌కె.ఖాజావలీ, తహశీల్దార్ వి.మురార్జీ, మార్కెటింగ్ ఎడి మహేంద్రనాధ్, మార్కెటింగ్ ఇఒ ఎం.సుధాకర్ పాల్గొన్నారు.

ఎంఎల్ఎకు ఫిర్యాదు

రైతు బజార్‌లో దుకాణాల కేటాయింపుల్లో అనేక అక్రమాలు చోటు చేసుకుంటున్నాయని, రికమండేషన్‌లో ఉన్న వారికే దుకాణాలు కేటాయించడంతో మిగిలిన వ్యాపారులు దుకాణాలు లేక ఇబ్బందులు పడాల్సి వస్తుందని రైతు బజార్‌లో దుకాణాలు నిర్వహిస్తున్న మహిళలు ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన స్పందించి రైతు బజార్‌కు సెలవు రోజైన మంగళవారం అందరితో సమావేశం నిర్వహించి ఎవరికీ ఇబ్బందులు లేకుండా, దుకాణదారులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

పరిశ్రమల అభివృద్ధి, విస్తరణకు తొలి ప్రాధాన్యత

రాష్ట్ర సమాచార, గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి
ఎంపీ పుట్టా మహేష్‌కుమార్‌ను అభినందించిన మంత్రి



మాట్లాడుతున్న మంత్రి కొలుసు పార్థసారధి

ప్రజాశక్తి - ఏలూరు

రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు తమ ప్రభుత్వం స్నేహపూరిత వాతావరణంలో చేయూత అందిస్తుందని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలు, గృహనిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశపు హాలులో గురువారం జిల్లాస్థాయి పారిశ్రామిక, పర్యావరణ, కార్మికుల భద్రతపై ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశం లెంపీ పుట్టా మహేష్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో మంత్రి పార్థసారథి మాట్లాడుతూ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం, పరిశ్రమల అభివృద్ధి, విస్తరణకు తమ ప్రభుత్వం తొలి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. గత ప్రభుత్వ నిర్ణయాల వల్ల రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి కుంటుపడిందని, ఆ వాతావరణాన్ని సరిదిద్ది, పారిశ్రామికవేత్తల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించడమే ఈ సమావేశ ముఖ్యోద్దేశమన్నారు. దీనికి కృషి చేసిన ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌ను మంత్రి అభినందించారు. సమావేశంలో పారిశ్రామిక వేత్తలు తెలిపిన సమస్యలను సిఎం చంద్రబాబు, పరిశ్రమల శాఖా మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ఆయా సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని మంత్రి సూచించారు. ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలోని ఎంతోమంది పారిశ్రామిక వేత్తలు తమ సమస్యలు పరిష్కరించాలని తనను కలిసి కోరారన్నారు. పరిశ్రమలు స్థాపించే వారికి ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందన్నారు. పరిశ్రమల విస్తరణకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామన్నారు. పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగావకాశాలు అందించాలని కోరారు. కొల్లేరు అభయారణ్యం పరిధిని 5 నుండి 3వ కాంటూర్‌కు తగ్గించాలని కోరుతూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, 3వ కాంటూర్ పరిధిలో 10 కిలోమీటర్ల పరిధిని 'గ్రీన్‌జోన్'గా ప్రకటించి కాలుష్యరహిత పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వాన్ని కోరామని అన్నారు. స్థానిక పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు ఉపాధి కల్పించే దిశగా స్వల్పకాలిక నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ అందించాలన్నారు. జిల్లాలో వచ్చే సెప్టెంబర్ నుండి ప్రతివారం 'జాబ్‌మేళా'లు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమలు స్థాపించడానికి ముందుకొచ్చే ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు సింగిల్ విండో పథకంలో నిర్దేశించిన సమ యంలో సంబ ంధిత శాఖల ద్వారా అనుమతులు జారీ చేస్తామన్నారు. రాజధాని అమరావతి సమీపంలో ఉన్నందున పరిశ్రమల ఏర్పాటుకు ఏలూరు జిల్లా అనువైందన్నారు. కైకలూరు ఎంఎల్ఎ డాక్టర్ కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో పారిశ్రామికాభివృద్ధికి తొలి అడుగు పడిందన్నారు. చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్ కుమార్ మాట్లాడుతూ పరిశ్రమల పరిసరాల్లో రోడ్లు తదితర మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వ, ప్రయివేట్ భాగస్వామ్యంలో పనులు చేపట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలన్నారు. పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు మాట్లాడుతూ పోలవరం వెనుకబడిన గిరిజన ప్రాంతమని, తమ ప్రాంతంలో పరిశ్రమలు స్థాపించి గిరిజనులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని కోరారు. భీమడోలు సమీపంలోని అంబర్‌పేటలోని లిక్సిల్ ఇండియా శానిటరీవేర్ కంపెనీ ప్రతినిధి లోకేష్ మాట్లాడుతూ తమ పరిశ్రమకు వచ్చే దారిలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయన్నారు. రహదారి అభివృద్ధికి చర్యలు తీసుకుంటే తమవంతు సహకారాన్ని అందిస్తామన్నారు. స్థానిక ఐటిఐలో సిరామిక్ పరిశ్రమకు సంబంధించి ప్రత్యేక కోర్సును ప్రవేశపెడితే స్థానికులకు తమ పరిశ్రమల్లో ఉద్యోగావకాశాలకు వీలుంటుందన్నారు. గోద్రెజ్ ఆగ్రోవెట్ పరిశ్రమ ప్రతినిధి చౌదరి, ఎస్ఆర్ సీడ్స్ ప్రతినిధి వెంకటరావుతోపాటు పలువురు పారిశ్రామికవేత్తలు మాట్లాడుతూ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యాక్ట్ ప్రకారం వసూలు చేస్తున్న ఒక శాతం సెస్‌ను కేవలం పరిశ్రమలో పూర్తి పెట్టుబడిపై కాకుండా, పరిశ్రమలో భవన నిర్మాణాల పెట్టుబడి వరకే పరిమితం చేయాలని సూచించారు. విద్యుత్‌ను నాణ్యతతో అంతరాయం లేకుండా అందించాలని కోరారు. రుద్రా ఇండస్ట్రీస్ గోపాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ 2022 వరకూ 0.6 శాతం ఉన్న డ్యూటీ ఛార్జీలు నేరుగా ఒక శాతానికి పెంచారని, దానిని తగ్గించాలని కోరారు. సమావేశంలో ఎంఎల్ఎలు బడేటి రాధాకృష్ణయ్య (చంటి), పత్సమట్ల ధర్మరాజు, డిఆర్ఒ డి.పుష్పమణి, ఆర్‌డిఒలు ఎన్ఎస్‌కె.ఖాజావలి, కె.అద్దయ్య, వై.భవానీశంకరి, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ వి.ఆదిశేషు, కాలుష్య నియంత్రణ మండలి ఇఇ వెంకటేశ్వరరావు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఆర్.త్రినాధరావు, కార్మికశాఖ ఉప కమిషనర్ పి.శ్రీనివాస్, ఎపిఐఐసి జోనల్ మేనేజర్ కె.బాబ్జి, ఉద్యాన శాఖ డిడి రామ్మోహన్, డిపిఒ తూతిక శ్రీనివాస్ విశ్వనాధ్, జిల్లాలోని వివిధ పరిశ్రమలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల భూమి ఆక్రమించారని లబ్ధిదారుల ధర్నా

ప్రజాశక్తి - కలిదిండి

ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాల భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు చేపట్టాలని కోరుతూ ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బాధిత లబ్ధిదారులు స్థానిక తహశీల్దార్ కార్యాలయం, పోలీస్ స్టేషన్ ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. మండలంలోని సానారుద్రవరంలో అర్హులైన పేదలకు గత ప్రభుత్వం సర్వే నెంబరు 382లోని ప్రభుత్వ భూమిని 64 మంది లబ్ధిదారులకు ఇళ్లస్థలాలుగా కేటాయించి పట్టాలు మంజూరు చేసిందన్నారు. ఆ భూమిని నున్న నాగేశ్వరరావు, నున్న సుబ్బాయమ్మ ఆక్రమించి నాటి ప్రభుత్వం ఏర్పాటు చేసిన సరిహద్దు రాళ్లను తొలగించారని తెలిపారు. ఈ విషయమై తహశీల్దార్‌కు, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో గత్యంతరం లేక ధర్నాకు దిగామన్నారు. పునాదుల వరకు వచ్చిన తన ఇంటి కంకర, ఇసుక పొలంలో దున్నేశారని, ఐరన్ ఊసలు పట్టుకుపోయారని లబ్ధిదారుడు తలకటూరి ప్రకాష్ ఆవేదన వ్యక్తం చేశారు. లబ్ధిదారుల ఫిర్యాదుపై అధికారులు స్పందించకపోవడం శోచనీయమని, సత్వరమే తగు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శేషపు మహంకాళిరావు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జక్కుల మహేష్, మన్నె రమేష్, టి.ప్రకాశరావు, టి.జగన్, కె.సత్యవతి, టి.దేవమణి, బుజ్జమ్మ, రమాదేవి, జె.మరియమ్మ పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న వ్యకాస నేతలు, లబ్ధిదారులు

బకాయి వేతనాలివ్వాలని ఎస్ఎస్ఎ ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

పెండింగ్ వేతనాలివ్వాలని కోరుతూ సమగ్ర శిక్ష కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది స్థానిక ఎంఇఒ కార్యాలయం వద్ద గురువారం ఆందోళన నిర్వహించారు. పెండింగ్ వేతనాలు, సమ్మె కాలపు జీతం, సమ్మె ఒప్పందాల అమలు, హెచ్ఆర్ పాలసీ, మినిమమ్ టైమ్ స్కేల్ వర్తింపజేయాలని కోరారు. మధ్యాహ్న భోజన సమయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు, చంద్రశేఖర్, జయకుమార్, కనకరాజు, బాబూరావు, ఇజ్రాయేలు, పద్మావతి పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ఎస్ఎస్ఎ ఉద్యోగులు

ఏకలవ్య గిరిజన గురుకుల పాఠశాలల్లో
ఉపాధ్యాయులుగా స్థానికులనే నియమించాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏకలవ్య గిరిజన గురుకుల పాఠశాలల్లో స్థానికులను మాత్రమే ఉపాధ్యాయులుగా నియమించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న బుట్టాయిగూడెం, విప్పలపాడుల్లో ఉన్న ఏకైక ఏకలవ్య గిరిజన గురుకుల పాఠశాలలో పర్మినెంట్ స్టాఫ్‌గా ఉత్తరాదికి చెందిన 18 మందిని నియమించినట్లు తెలిసిందని, ఇప్పటికే రాష్ట్రంలో ఉన్న ఏకలవ్య గురుకుల పాఠాశాలల్లో చాలా చోట్ల ఉత్తరాదికి చెందిన హిందీ మాత్రమే వచ్చిన వారిని నియమించినట్లు తెలుస్తోందన్నారు. హిందీ మాత్రమే వచ్చిన వారు ఇక్కడ ఏ భాషలో విద్యాబోధన చేయగలుగుతారని ఆయన ప్రశ్నించారు. ఈ పద్ధతి గిరిజనులను ఉన్నత విద్యల నుంచి దూరం చేసే కుట్రలో భాగంగానే పరిగణించాల్సి వస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం ఈ విషయంలో మన తెలుగు రాష్ట్రంలో ఈ ప్రాంతాలకు సంబంధించిన వారిని మాత్రమే నియమించాలని ఆయన కోరారు. స్థానిక భాషలో విద్య బోధనలు అందించే విధంగా స్థానికులను మాత్రమే ఏకలవ్య గిరిజన గురుకుల పాఠశాలల్లో నియమించాలని ఆయన డిమాండ్ చేశారు.

మెప్మా ఉద్యోగులపై కక్ష సాధింపు చర్యలు ఆపాలి

ఐద్వా జిల్లా కార్యదర్శి శ్యామలారాణి

ఏలూరు అర్బన్ : మెప్మా ఉద్యోగులపై కక్ష సాధింపు చర్యలు, అక్రమ తొలగింపులు వెంటనే ఆపాలని ఐద్వా జిల్లా కార్యదర్శి ఎ.శ్యామలారాణి డిమాండ్ చేశారు. ఏలూరు ఐద్వా కార్యాలయంలో నగర కమిటీ సమావేశం జి.శారద అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యామలారాణి మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎన్నికల్లో తమకు అనుకూలంగా పనిచేయలేదని మెప్మా ఆర్‌పిలను తొలగిస్తున్నారని విమర్శించారు. 15 మంది వర్క్‌కు సంబంధించిన ఆన్‌లైన్ లాగిన్ ఆపారన్నారు. ప్రభుత్వాలు అనేవి ప్రతి ఐదేళ్లకు మారుతూ ఉంటాయని, ఉద్యోగులు ఏ ప్రభుత్వం అధికారంలో ఉంటే ఆ ప్రభుత్వం చెప్పిన పనులు చేయాల్సి ఉంటుందన్నారు. ఇప్పుడు ప్రభుత్వం మారిన తరువాత తమకు అనుకూలంగా లేరని ఆర్‌పిలను వేధించడం, తొలగించడం హేయమన్నారు. మెప్మా పిఒ డైరెక్షన్‌లో మెప్మా సిబ్బంది ఆర్‌పిలపై వేధింపులకు గురిచేస్తూ లాగిన్‌లు ఆపారన్నారు. ప్రభుత్వాలు చేపడుతున్న సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేసేది ఉద్యోగులేన న్నారు. ఎన్నికల్లో తమకు అనుకూలంగా చేయలేదని అధికారంలోకి రాగానే ఈ విధంగా చిన్న చిన్న చిరు ఉద్యోగులైన మెప్మా ఆర్‌పిలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం సిగ్గు చేటన్నారు. తక్షణమే ఇటువంటి చర్యలు విరమించుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆర్‌పిలకు మద్దతుగా ఐద్వా పోరాడుతుందని తెలిపారు. ఈ సమావేశంలో ఐద్వా నాయకులు చింతాడ వెంకటలక్ష్మి, సిహెచ్.రాజ్యలక్ష్మి, సైదాని, ఎం.శారద, భవాని, కె.నాగమణి పాల్గొన్నారు.

పార్కింగ్ స్థలంలో దుకాణాలు

రోడ్డుపై వాహనాలు
వినియోగదారుల అవస్థలు
పత్తేబాద రైతుబజార్ వద్ద పరిస్థితి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పార్కింగ్ కోసం కేటాయించిన స్థలాన్ని నిబంధనలకు విరుద్ధంగా దుకాణాలకు కేటాయించడంతో వినియోగదారులు నానా అవస్థలు పడుతున్న పరిస్థితి ఏలూరులోని పత్తేబాద రైతు బజార్ వద్ద ఏర్పడింది. మరోపక్క చినుకు పడితే రైతు బజార్‌తో పాటు చుట్టూ ఉన్న పరిసరాలు మొత్తం చిత్తడిగా మారడంతో పాటు దుర్గంధం వ్యాపిస్తూ ఉండటంతో వర్షాకాలంలో వినియోగదారులు రైతుబజార్‌కు వెళ్లలేని పరిస్థితి నెలకొంది.

దళారులు, మధ్యవర్తులు లేకుండా రైతులే నేరుగా పండించిన పంటలను వినియోగదారులకు అమ్ముకునే ఉద్దేశంతో 1999లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం రైతు బజార్లను ప్రారంభించింది. ఏలూరు నగరంలో కూడా పత్తేబాద ప్రాంతంలోని అప్పటి పొట్టి శ్రీరాములు మార్కెట్‌లో రైతుబజార్‌ను ప్రభుత్వం ప్రారంభించింది. అగ్రికల్చర్ మార్కెటింగ్ శాఖ దీనిని నిర్వహిస్తుంది. ప్రారంభంలో 60 దుకాణాలు ఉండగా ఇప్పుడు 90 దుకాణాలు రైతు బజార్లో ఉన్నాయి. ప్రారంభంలో 55 సెంట్ల స్థలంలో రైతుబజార్ ఏర్పాటు చేయగా తర్వాత కాలంలో మున్సిపాలిటీకి చెందిన 15 సెంట్లు రైతు బజార్‌కు కేటాయించడంతో ప్రస్తుతం 70 సెంట్ల స్థలంలో రైతు బజార్ నిర్వహిస్తున్నారు. 1999లోనే రైతుబజార్ ఏర్పాటు చేసినప్పుడే నాలుగు సెంట్ల స్థలాన్ని ప్రహరీ గోడ బయట రైతుబజార్ పార్కింగ్ కోసం ఏర్పాటు చేశారు. అయితే 2004లో అప్పటి కలెక్టర్ పాలు, పాల ఉత్పత్తులు అమ్మే ఒక డెయిరీకి స్థలం కేటాయించడంతో పార్కింగ్ స్థలంలో ఒక బడ్డీని ఏర్పాటు చేశారు. మూడు, నాలుగేళ్ల క్రితం అప్పటి జాయింట్ కలెక్టర్ సిఫారసుతో మరో కిరాణా దుకాణానికి స్థలం కేటాయించడంతో మరో బడ్డీ ఏర్పాటైంది. ఆ తర్వాత ఎంపీ రికమండేషన్ అంటూ మరో వ్యాపారుడు అధికారికంగా లేఖ తీసుకురావడంతో ఒక టీ దుకాణానికి మళ్లీ స్థలం కేటాయించారు. దీంతో నాలుగు సెంట్లు ఉన్న పార్కింగ్ స్థలంలో ఒక డెయిరీ, ఒక కిరాణా, ఒక టీ దుకాణం ఉండటంతో పార్కింగ్ కోసం కేటాయించిన స్థలం మొత్తం ఆక్రమించినట్లు అయింది. దీంతో రైతు బజారుకు వచ్చిన వినియోగదారులు పార్కింగ్ కోసం స్థలం లేక రోడ్డు మీద వాహనాలు పార్కింగ్ చేయాల్సి రావటంతో నానా అవస్థలు పడుతున్నారు. దీంతో అక్కడ ట్రాఫిక్‌కు ఇబ్బందిగా మారడంతో అప్పుడప్పుడు వస్తున్న పోలీసులు రోడ్డు మీద పార్క్ చేసిన వాహనాలకు చలానాలు విధిస్తున్నారు. అంతేకాకుండా తోపుడు బండ్లపై వ్యాపారం చేసేవారు రైతు బజార్ ముందు రోడ్డు ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్నారు. మరోపక్క రైతు బజార్ ముందు ఉన్న రోడ్డు డివైడర్ మీద సైతం వ్యాపారులు పండ్లు, కూరగాయలు పెట్టి వ్యాపారం చేస్తున్నారు. దీంతో 30 అడుగులు ఉండే రోడ్డు పది అడుగులకు కుదించుకుపోయి అక్కడ ట్రాఫిక్ ప్రతిరోజు అస్తవ్యస్తంగా తయారవుతుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రైతుబజార్ పార్కింగ్ స్థలంలో ఏర్పాటుచేసిన దుకాణాలను తొలగించి పార్కింగ్ స్థలాన్ని పార్కింగ్ కోసమే వదిలేయాలని, రోడ్డు మీద వ్యాపారాలు చేసే వారికి రైతుబజార్ ఎదురుగా ఉన్న బృందా వన్ పార్క్ వద్ద గ్రీన్ జోన్ ఏర్పాటుచేసి అక్కడ వారి వ్యాపారాలకు స్థలాలు కేటాయించాలని వినియోగదారులు కోరుతున్నారు.

ఈ విషయంపై రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ మాట్లాడుతూ రైతు బజార్ ఆదాయం పెంచేందుకు అవుట్‌లెట్ దుకాణాలు ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులు సూచిస్తున్నారని, అందుకే పార్కింగ్ స్థలంలో దుకాణాలు ఏర్పాటు చేశామని చెబుతున్నారు. కాని నిబంధనల ప్రకారం రైతుబజార్ ఆదాయం పెంచాలంటే అవుట్ లెట్ దుకాణాలు ఏర్పాటు చేయాలంటే ప్రభుత్వమే వాటినే నిర్మించి, టెండర్ ప్రక్రియ ద్వారా ఎవరు ఎక్కువ చెల్లించేందుకు ముందుకు వస్తే వారికే దుకాణాలు కేటాయించాల్సి ఉంది. ఒకవేళ దుకాణాలు నిర్మించలేని పరిస్థితి ఉంటే, స్థలాలు కేటాయించాల్సి వస్తే అప్పుడు కూడా స్థలాలను మార్కింగ్ చేసి, టెండర్ నిర్వహించి ఎక్కువ చెల్లించేందుకు ముందుకు వచ్చిన వారికే స్థలాలు కేటాయించాల్సి ఉంది. అధికారులు చర్యలు తీసుకొని ఈ విషయంలో పరిస్థితిని చక్కదిద్ది వినియోగదారుల కోసం పార్కింగ్ స్థలం కేటాయించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాల్సిన అవసరం ఉందని చెప్పారు.


రైతుబజార్‌లో రోడ్డుపై వాహనాలు

చినుకు పడితే చిత్తడే

మరోపక్క కొద్దిపాటి చినుకులు పడితే చాలు రైతు బజార్ ప్రాంతమంతా చిత్తడిగా మారి దుర్గంధంతో నిండిపోతుంది. పెద్ద వర్షం వస్తే రైతు బజార్ మొత్తం నీట మునిగి వినియోగదారులు లోపలికి వెళ్లలేని పరిస్థితి నెలకొంటుంది. రైతు బజార్ వద్ద పార్కింగ్ స్థలం లేకపోవడంతో ఎక్కువమంది వెనుక ఉన్న గేటు ద్వారా లోపలికి వెళ్తూ ఉంటారు. అయితే కొద్దిపాటి వర్షానికి వెనుక వైపు ఉన్న డ్రెయినేజీ మొత్తం పొంగి పొర్లి రోడ్డు మొత్తం బురద మాయంఅవుతుంది. రైతుబజార్‌ను ఆనుకుని శానిటరీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం ఉన్నప్పటికీ అక్కడ శానిటేషన్ సక్రమంగా నిర్వహించడంలో సిబ్బంది, అధికారులు విఫలమవుతున్నారు. దీనికి పరిష్కారంగా రైతుబజార్ వెనుక ఉన్న రోడ్డును తిరిగి ఎత్తుగా నిర్మించాల్సిన అవసరం ఉంది.

విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం : జెసి

నిబంధనలకు విరుద్ధంగా షాపులు కేటాయించడంపై గురువారం రాయితీ కౌంటర్ల ప్రారంభోత్సవానికి రైతుబజార్‌కు విచ్చేసిన జెసి బి.లావణ్యవేణిని వివరణ కోరగా ఈ విషయంపై పూర్తిస్థాయిలో విచారణ చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఉంగుటూరులో సమస్యలు పరిష్కరించాలి

ఎంఎల్ఎ ధర్మరాజుకు సిపిఎం నేతల వినతి

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉంగుటూరు నియోజకవర్గంలో ప్రధాన సమస్యలు దీర్ఘకాలికంగా తిష్టవేశాయని, వాటిని పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.లింగరాజు కోరారు. మండలంలోని నారాయణపురంలో ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజును సిపిఎం నాయకులు గురువారం కలిసి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా లింగరాజు మాట్లాడుతూ కొల్లేరు కాంటూరు ఐదు నుంచి మూడుకు తగ్గించి జీవనోపాధి పెంపొందేలా కృషి చేయాలన్నారు. నిడమర్రు, గణపవరం పరిధిలో అగ్నిమాపక కేంద్రం, నిడమర్రులో బస్టాండ్, జూనియర్ కాలేజీ, అంతర్గత రహదారులు నిర్మించాలన్నారు. అక్రమ చేపల చెరువులతో కాలుష్యం పెరుగుతోందని చెప్పారు. వనసంరక్షణ సమితి ఆధ్వర్యంలో పెంచిన జామాయిల్ చెట్లు కటింగ్ ఆర్డర్ ఇప్పించాలన్నారు. గణపవరం-బొబ్బిలి, ఏలూరు కాలువపై నారాయణపురం, పూళ్ల, ఉంగుటూరు వంతెనలు నిర్మించాలని కోరారు. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో సౌకర్యాలు మెరుగుపరచి పేదలకు వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. భవన నిర్మాణ కార్మికుల హక్కులు, చట్టాలను గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని, మీరైనా న్యాయం చేయాలని కోరారు. సిపిఎం నాయకులు గుత్తికొండ వెంకట కృష్ణారావు, నారపల్లి రమణారావు, అనుపోజు వీరబ్రహ్మం, సీరా అప్పారావు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.


ఎంఎల్ఎకు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నేతలు

పలువురికి ట్రిపుల్ ఐటీలో సీట్లు

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలో ఐదుగురు ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించారు. ముసునూరు ముసునూరు బాలికల గురుకుల పాఠశాలకు చెందిన తోటపల్లిటి పావని, కోట హాసిని, జి.వెన్నెల నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారని ఆ పాఠశాల ప్రిన్సిపల్ కొండాలత్తల ప్రవీణ తెలిపారు. గోపవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు దేవరపల్లి సంజన శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారని ప్రధానోపాధ్యాయులు ఎలిఎవిఎస్.నాగేంద్రరావు చెప్పారు. వేల్పుచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి దేవరకొట షణ్ముఖవెంకటసాయి ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించారని ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ తెలిపారు.

ద్వారకాతిరుమల రూరల్ :మండలంలోని జి.కొత్తపల్లి జిల్లా పరిషత్ ఓరియంటల్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు. రాచూరి కృష్ణ తేజ, రాచూరి కృష్ణచైతన్య ఎంపికయ్యారు. వీరిద్దరూ అన్నా చెల్లెళ్ళ కావడం విశేషం.

మండవల్లి :మండవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని సాయిశ్రీ శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో సీటు సాధించింది. సాయిశ్రీ అన్నయ్య యశ్వంత్‌సాయి నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించి అభ్యసిస్తున్నాడు. సాయిశ్రీ ట్రిపుల్ ఐటీలో సీటు సాధించడం పట్ల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు, గ్రామ ప్రముఖులు అభినందించారు.

పోలవరం : గూటాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు గర్రే సాయి తరుణ్ నూజివీడు ట్రిపుల్ ఐటీలో, కరిబండి ప్రణీత శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు. ఈ సందర్భంగా వారిద్దరిని ప్రధానోపాధ్యాయులు కెవి.రాఘవన్, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.

నిడమర్రు : మండల కేంద్రమైన నిడమర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థినులు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు బి.రాజేశ్వరి తెలిపారు. వీరిలో కొమ్మిరెడ్డి సాయి సంధ్య నూజివీడు ట్రిపుల్ ఐటీకి, చింతా దివ్య శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారన్నారు. వీరి విజయానికి కృషి చేసిన ఉపాధ్యాయులను హెచ్‌ఎం అభినందించారు.

కామవరపుకోట : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి కొండపాములూరి సాత్విక ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించినట్లు ప్రధానోపాధ్యాయులు భాగా గోపాలకృష్ణ తెలిపారు.

చింతలపూడి : చింతలపూడి ప్రభుత్వ సుబ్బరాజు పాఠశాల విద్యార్థి కానూరు మహిత ఒంగోలు ట్రిపుల్ ఐటీలో, యర్రగుంటపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి గోగులమూడి చరణ్ కుమార్ శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో సీటు సాధించినట్లు ఎంఇఓ కిరణ్‌బాబు తెలిపారు.

ఉచిత ఇసుక విధానంతో ఊరట : చింతమనేని

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

టిడిపి కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన ఉచిత ఇసుక విధానం వల్ల ప్రజలకు భారీ ఊరట లభించిందని ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ అన్నారు. పెదపాడు మండలంలోని వట్లూరు గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రభుత్వ ఉచిత ఇసుక విధానాన్ని ప్రారంభించారు.

సమస్యలు పరిష్కరించాలని ఎంపీకి వినతి

ప్రజాశక్తి - కామవరపుకోట

మండలంలో పెండింగ్‌లో ఉన్న పలు ప్రధాన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ టిడిపి మండలాధ్యక్షులు కిలారు సత్యనారాయణ ఏలూరు ఎంపీ మహేష్‌కు వినతిపత్రం అందించారు. ఎంపీ మహేష్‌ను ఏలూరులోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో మండలంలోని పలువురు టిడిపి నాయకులతో గురువారం కలిశారు. ఈ సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో 22 సమస్యలను ఎంపి మహేష్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని చెప్పారు.

విద్యార్థుల సమస్యల పరిశీలన

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

కొయ్యలగూడెం జెడ్‌పి హెచ్ స్కూలును ఎస్‌ఎఫ్‌ఐ ఏలూరు జిల్లా ఉపాధ్యక్షులు యు.వినోద్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సమస్యలు తెలుసుకున్నారు.

డిగ్రీ కళాశాలలో 20 వరకు అడ్మిషన్లు

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆన్‌లైన్ ద్వారా డిగ్రీ అడ్మిషన్లకు గడువు తేదీని ఈ నెల 20వ తేదీ వరకు ప్రభుత్వం పొడిగించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టిఓ.విశ్వేశ్వరరావు తెలిపారు. డిగ్రీలో చేరాలనుకున్న విద్యార్థులు కళాశాలకు వచ్చి ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. బిఎ, ఎకనామిక్స్ 40 సీట్లు, బిఎస్‌సి జువాలజీ 40 సీట్లు, బికాం కంప్యూటర్స్‌లో 60 సీట్లు, బి ఎస్‌సి కంప్యూటర్‌లో 40 సీట్లు ఉన్నాయని తెలిపారు. ఈ ఏడాది నుంచి పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్స్ ప్రారంభిస్తున్నామన్నారు. పీజీ ఎం.కామ్‌లో చేరలనుకున్న విద్యార్థులు కూడా కళాశాలను సందర్శించాలని తెలిపారు.

అంగన్‌వాడీ చిన్నారులకు ప్లేట్లు, గ్లాసులు

చింతలపూడి :మండలంలోని పాత చింతలపూడి గ్రామంలో అంగన్‌వాడీ చిన్నారులకు బోడ రాణి మెమోరియల్ ట్రస్ట్ తరపున టిడిపి చింతలపూడి నగర పంచాయతీ ప్రధాన కార్యదర్శి బోడ నాగభూషణం ఆధ్వర్యంలో గురువారం ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. ప్లేట్లు, గ్లాసులు లేక చిన్నారులు ఇబ్బంది పడుతున్నారని తమ ట్రస్ట్ దృష్టికి తీసుకురావడంతో అందించినట్లు రాణి మెమోరియల్ ట్రస్ట్ ఫౌండర్, ఛైర్మన్, ఐటిడిపి చింతలపూడి నియోజకవర్గ అధ్యక్షులు బోడ అనీష్‌కుమార్ చెప్పారు. ఇంకెవరికైనా, ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా తమ దృష్టికి తీసుకొస్తే తోడ్పాటును అందిస్తామన్నారు. చింతలపూడి నగర పంచాయతీ అధ్యక్షులు పక్కాల వెంకటేశ్వరరావు, జిల్లా రైతు కార్యదర్శి కొత్తపూడి శేషగిరిరావు మాట్లాడారు.

నేరాలు - ఘోరాలు

లారీ ఢీకొని కుమారుడు మృతి

తల్లికి తీవ్ర గాయాలు


శ్యామ్‌కుమార్ (ఫైల్)

ప్రజాశక్తి - చింతలపూడి

కృష్ణాజిల్లా గన్నవరం మండలం చిన ఆవుటపల్లి వద్ద జాతీయ రహదారిపై గురువారం చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో చింతలపూడి మండలం యర్రగుంటపల్లికి చెందిన యువకుడు మృతి చెందాడు. యువకుని తల్లికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల ప్రకారం... యర్రగుంటపల్లి గ్రామానికి చెందిన జొన్నగంటి నాగమణి, శ్యామ్‌కుమార్ తమ వ్యక్తిగత పనుల నిమిత్తం బైక్‌పై విజయవాడ బయలుదేరారు. ఈ క్రమంలో వారు కృష్ణాజిల్లా చిన అవుటపల్లి వద్ద జాతీయ రహదారిపై వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన లారీ వారిని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్యామ్‌కుమార్ (28) అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాలపాలైన నాగమణిని స్థానికులు 108లో విజయవాడ ఆసుపత్రికి తరలించారు. మృతుడు వి.శ్యామ్‌కుమార్ (28) గతంలో చెక్‌పోస్ట్ వద్ద ఎస్‌పిఒగా పనిచేశారు. ప్రస్తుతం పోలీస్ ఉద్యోగం కోసం ప్రిపేర్ అవుతున్నాడు.

విద్యార్థిపై కొండముచ్చు దాడి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్


జంగారెడ్డిగూడెం జిల్లా పరిషత్ హైస్కూలు ఆవరణలో ఆడుకుంటున్న తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థిపై కొండముచ్చు దాడి చేసింది. ఈ దాడిలో గాయాలపాలైన విద్యార్థిని జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం విద్యార్థి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని ప్రధానోపాధ్యాయురాలు లోవకుమారి తెలిపారు.

పరిస్థితి విషమించి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - టి.నరసాపురం

కడుపు నొప్పి తాళలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరల ప్రకారం... టి.నరసాపురం పంచాయతీ ముత్యాలమ్మ పేటకు చెందిన తాతా కాశీవిశ్వనాథం కడుపు నొప్పి తాళలేక ఈ నెల ఎనిమిదో తేదీన పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు అతడిని విజయవాడలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుని కుమారుడు రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ డి.దుర్గామహేశ్వరరావు తెలిపారు.

జనాభా నియంత్రణపై అవగాహనా ర్యాలీలు


ఏలూరు టౌన్ : మాట్లాడుతున్న కమిషనర్

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా స్థానిక పట్టణ ఆరోగ్య కేంద్రం పవర్‌పేటలో గురువారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏలూరు కార్పొరేషన్ కమిషనర్ ఎస్.వెంకట కృష్ణ మాట్లాడారు. కుటుంబ ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా భార్యాభర్తలు అవగాహనతతో బిడ్డల్ని కనాలన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బి.మాలతి, యుపిహెచ్‌పి వైద్యాధికారి డాక్టర్ గౌతమ్, అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవింద రావు పాల్గొన్నారు. పెరుగుతున్న జనాభాను నియంత్రించాలంటే కుటుంబ నియంత్రణ ఒక్కటే పరిష్కారమని పెదవేగి ప్రాథమిక వైద్యాధికారులు పూర్ణిమ, డాక్టర్ మాధవి అన్నారు. పెదవేగిలో కాబోయే తల్లిదండ్రులకు, ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు.

జీలుగుమిల్లి : ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా గురువారం జీలుగుమిల్లి పిహెచ్‌సి సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో జనాభా నియంత్రణకు అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పిహెచ్‌సి వైద్యాధికారిణి బి.గాయత్రి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు రేన్యా, అంగన్వాడీ సూపర్‌వైజర్ లక్ష్మీ దేవమ్మ పాల్గొన్నారు.

ఉంగుటూరు : మండలంలోని కాగుపాడు జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులు మానవహారం, ర్యాలీ నిర్వహించారు. పిహెచ్‌సి వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ముసునూరు : మండలంలోని రమణక్కపేట పిహెచ్‌సి పరిధిలో సోమవరం గ్రామంలో సదస్సు, ర్యాలీ నిర్వహించారు. పిహెచ్‌సి వైద్యులు ఎండి.కరీముల్లా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు, ఎఎన్‌ఎంలు పాల్గొన్నారు.

కామవరపుకోట : కామవరపుకోట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అర్థశాస్త్రం, ఎన్‌ఎస్‌ఎస్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ఎం.మల్లేశ్వరరావు మాట్లాడుతూ జనాభా పెరుగుదల వల్ల కలిగే నష్టాల గురించి వివరించారు. ఆర్థిక శాస్త్రం విభాగం అధ్యాపకురాలు కె.ఇందిరాకుమారి, ఎన్‌ఎస్‌ఎస్ విభాగం కో-ఆర్డినేటర్ డాక్టర్ జి.శ్రీనివాసరావు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. మండలంలోని రావికంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జ్యోతి రావు పూలే ది భారత్ స్కౌట్స్, గైడ్స్ విద్యార్థులచే మొక్కలు నాటించి చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఏలూరు జిల్లా స్కౌట్స్ ట్రైనింగ్ కమిషనర్ బిరుదుగడ్డ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నగరంలో కమిషనర్ పర్యటన

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

మున్సిపల్ కమిషనర్ వెంకటకృష్ణ గురువారం ఉదయం ఐదు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు పట్టణంలో వివిధ ప్రాంతాలను పరిశీలించారు. సర్కిల్ నెంబర్ ఐదు, ఆరులలో, నవయుగ హోటల్ దగ్గర, సాయినగర్ సచివాలయంలో పారిశుధ్య కార్మికుల హాజరును పరిశీలించారు. కార్మికులకు తగు సూచనలు చేశారు. పోణంగిలో డంపింగ్ యార్డ్‌ను, వర్మీ కంపోస్ట్ యూనిట్‌ను పరిశీలించారు. రాజరాజేశ్వరి నగర్‌లో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఫిర్యాదుల పరిష్కారానికి 24 గంటలు పనిచేసే కార్పొరేషన్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నెంబర్ 8978999955, ల్యాండ్ లైన్ నెంబర్ 08812232101, టోల్ ఫ్రీ నెంబర్ 1800 425 4287కు ఫోన్ చేయాలని తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

మండల కేంద్రమైన ఆగిరిపల్లిలో నెలకొన్న ప్రధాన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంత్రి పార్థసారథికి ఆగిరిపల్లికి చెందిన మాజీ సర్పంచులు, పిఎసిఎస్ అధ్యక్షులు, మాజీ బిల్డింగ్ సొసైటీ అధ్యక్షులు వినతిపత్రం అందించారు. మంత్రిని ఆయన క్యాంపు కార్యాలయంలో గురువారం కలిసి వినతిపత్రం అందించారు.

అధికారులు ప్రొటోకాల్ పాటించడంలేదు : జెడ్‌పిటిసి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

జంగారెడ్డిగూడెం మండలంలో అధికారులు ప్రోటోకాల్ పాటించడంలేదని జెడ్‌పిటిసి సభ్యులు పల్నాటి బాబ్జి అన్నారు. ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించేటప్పుడు తమకు కనీసం సమాచారం అందించడంలేదన్నారు. అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, ప్రోటోకాల్ పాటించడంలేదని చెప్పారు. అందరం కలిసి అభివృద్ధి వైపు నడవాలని తెలిపారు.

24 నుంచి ఎఐటియుసి రాష్ట్రస్థాయి శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - చింతలపూడి

ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి అనుబంధం)రాష్ట్ర స్థాయి శిక్షణా తరగతులు ఈ నెల 24, 25, 26 తేదీల్లో మదనపల్లిలో నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షులు కునపాముల విగ్నేష్ తెలిపారు. చింతలపూడి నగర పంచాయతీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సమావేశం వెలగాడ రాధ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. అనంతరం కరపత్రం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తొర్లపాటి బాబు, జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చిత్తపూరులో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని చిత్తపూరు గ్రామంలో గడిచిన నాలుగు రోజులుగా డ్రెయినేజీల పూడిక తీస్తున్నట్లు గ్రామ పంచాయతీ సర్పంచి రమేష్ తెలిపారు. చిత్తపూరులో కలెక్టర్ ఆదేశాల మేరకు స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా డ్రెయినేజీల పూడిక తీస్తున్నట్లు, మురిగునీరు నిల్వ ఉండకుండా పనులు చేయిస్తున్నట్లు రమేష్ తెలిపారు. గ్రామంలో అన్ని బజార్లు శుభ్రం చేస్తున్నట్లు, బ్లీచింగ్ చల్లించి శానిటేషన్ చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనారాయణ, ఎంపిటిసి సభ్యులు సుజాత, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఎరువుల విక్రయాల్లో నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి - మండవల్లి

ఎరువులు, పురుగుమందుల విక్రయాల్లో నిబంధనలను పాటించుకుంటే అనుమతులు రద్దు చేస్తామని మత్స్యశాఖ ఎడి చాంద్ బాషా హెచ్చరించారు. రెవెన్యూ మత్స్య ఎంపెడ పోలీస్ డ్రగ్ ఫుడ్ తదితర శాఖలతో కూడిన టాస్క్ ఫోర్స్ అధికారులు మండలంలోని ఎరువులుచ పురుగుమందుల దుకాణాలపై గురువారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుకాణాల్లో అనుమతి లేని యాంటీబయాటిక్స్ మందులను విక్రయించకూడదన్నారు.

ద్వారకాతిరుమలలో ఎంఎల్‌ఎ వెంకటరాజు పర్యటన

ప్రజాశక్తి - ద్వారకా తిరుమల

గోపాలపురం ఎంఎల్‌ఎ మద్దిపాటి వెంకటరాజు ద్వారకాతిరుమలలో గ్రామంలో గురువారం పర్యటించారు. పారిశుధ్య, ప్రభుత్వ ఇళ్ల స్థలాలు, ఖాళీ ప్రదేశాలు, ఆక్రమణలు పరిశీలించారు. గ్రామం పూర్తిస్థాయి నివేదిక తయారుచేసి రెండు వారాల్లో అందించాలని అధికారులను ఆదేశించారు. నాయీ బ్రాహ్మణుల సంక్షేమ సంఘం వారికి ఇచ్చిన హామీ మేరకు కళ్యాణ మండపం నిర్మాణం నిమిత్తం స్థలాన్ని పరిశీలించారు.

రామ్మోహన్‌రావుకు సత్కారం

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

భీమవరం ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడుగా ద్వారకాతిరుమల శ్రీ వాసవి ఆర్య వైశ్య కళ్యాణ మండపం ట్రస్ట్ ఛైర్మన్ బొండాడ రామ్మోహన్‌రావు(రాంపండు) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ద్వారకాతిరుమల శ్రీ వాసవి ఆర్యవైశ్య కళ్యాణ మంటపం ట్రస్ట్ తరపున సభ్యులు ఆయనకు సన్మానం చేశారు. ద్వారకా తిరుమల ఆర్యవైశ్య ట్రస్ట్ ఛైర్మన్‌గా ఆయన 25 సంవత్సరాల నుంచి సేవలందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ఇమ్మడి రత్నాజీ, ఇమ్మడి నాగు, వంటిపల్లి బాల భాస్కరరావు, నల్ల మెల్లి జగన్నాథరావు, మానేపల్లి సత్యనారాయణ, ఒబిలిశెట్టి కాశీ, గుడిమెట్ల గంగాధర్ పాల్గొన్నారు.

డెమోక్రటిక్ పిఆర్‌టియు కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

డెమోక్రటిక్ పిఆర్‌టియు ఆగిరిపల్లి మండల ప్రధాన కార్యదర్శిగా కోలంటి వంశీ వశిష్ట ఎన్నికయ్యారు. డెమోక్రటిక్ పిఆర్‌టియు రాష్ట్ర కార్యాలయంలో ఆగిరిపల్లి మండల నూతన కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. గౌరవ అధ్యక్షురాలిగా బివిఎస్.లక్ష్మి, అధ్యక్షులుగా జి.నాగరాజు, ఆర్థిక కార్యదర్శిగా కె.రవికుమార్, అసోసియేట్ అధ్యక్షులుగా ఎం.యాలాద్రి, ఉపాధ్యక్షులుగా కె.శివతేజ, మహిళా కార్యదర్శిగా ఎం.సుహాసిని, ఆర్థిక కమిటీ సభ్యురాలిగా ఇందుమతి ఎన్నికయ్యారు.

మాతా శిశు సంక్షేమమే లక్ష్యం

రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ మెంబర్ రాజేంద్రప్రసాద్

మండవల్లి : మాతా శిశు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ మెంబర్ డాక్టర్ రాజేంద్రప్రసాద్ అన్నారు. ఐసిడిఎస్ పరిధిలోని కైకలూరు, కలిదిండి, మండ వల్లి, ముదినేపల్లి అంగన్వాడీ కార్యకర్తలకు బేటి బచావో బేటి పడావో కార్యక్రమంపై గురువారం నిర్వహించిన కార్యక్రమం లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళ సంరక్షణకు అనేక చట్టాలు ఉన్నాయన్నారు. మహిళలపై జరిగే ఆకృత్యాలపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపిం దన్నారు. అనంతరం బాల్యవివాహల నిషేధ చట్టం, పోక్సో, బాలల న్యాయ ఆదరణ, సంస్కరణ, బాలల హక్కుల, బాల కార్మికుల, ఉచిత నిర్బంధ హక్కు చట్టాలపై ఆయన అవగాహన కల్పించారు.

మహిళా చట్టాలపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తంకుమార్ ఆదేశాల ప్రకారం గురువారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో స్వాతి మహిళా అభ్యుదయ సంఘం, జిల్లా న్యాయ సేవాధి కార సంస్థ సంయుక్తంగా మహిళా చట్టాలపై అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో ట్రైనీ జడ్జిలు ఎం.రాజరాజేశ్వరి తేజస్విని, పివిఎస్‌ఎన్.లక్ష్మీలావణ్య, పివి.నాగరంజిత్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి ఎం.రాజరాజేశ్వరి తేజస్విని మాట్లాడుతూ మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు.

తెలుగు ఎన్‌ఆర్‌ఐల సేవాభావం అభినందనీయం

ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

మాతృభూమి పట్ల, సామాజిక సేవల పట్ల తెలుగు ఎన్‌ఆర్‌ఐలకు ఉన్న సేవాభావం ఎంతో అభినందనీయమని దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ అన్నారు. పెదపాడు మండలం వట్లూరు గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు మెరుగైన డిజిటల్ విద్యను అందించాలనే సంకల్పంతో ఉత్తర అమెరికా తెలుగు సంఘం (నాటా) ఛైర్మన్ ప్రశాంత్ పిన్నమనేని, అధ్యక్షులు మదన్ పాములపాటి, ఉపాధ్యక్షులు భాను ప్రకాష్ ధూళిపాళ్ల సంయుక్త ఆధ్వర్యంలో బహుకరించిన సుమారు రూ.మూడు లక్షల విలువైన పది కంప్యూటర్లు, డిజిటల్ విద్యా పరికరాలతో ఏర్పాటైన డిజిటల్ తరగతి గదులను ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ ప్రారంభించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి అబ్రహం, టిడిపి నాయకులు, ఎంపిడిఒ తేజ రతన్, మండల విద్యాశాఖాధికారులు సచ్చితి నరసింహమూర్తి, డివి.రమణ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

రోడ్డు ప్రమాదాలు, అగ్ని ప్రమాదాల నివారణ పట్ల ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని మేఘా గ్యాస్ మదర్‌స్టేషన్ మేనేజర్ సిహెచ్.రవికిరణ్ అన్నారు. ఆగిరిపల్లి జెడ్‌పిహెచ్ పాఠశాలలో సహజ వాయువు, రహదారి భద్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాదాల నివారణ, సమాచారం తెలియజేయాల్సిన టోల్ ఫ్రీ నెంబర్ల గురించి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్యాస్ లీకై ప్రమాదం నెలకొన్న సమయంలో ఎమర్జెన్సీ నెంబర్లు 18001231803, 7093082044 సమాచారం అందించాలని తెలిపారు.

పారిశుధ్యం నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

కామవరపుకోట :పారిశుధ్యం, తాగునీటి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని జంగారెడ్డిగూడెం డివిజనల్ పంచాయతీ అధికారి ఎమ్‌డి. రజాఉల్లా అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ జె.స్వర్ణభారతితో కలిసి మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో స్టాప్ డయోరియా, తాగునీరు, పారిశుధ్యం పలు అంశాలపై సమీక్షించారు. అనంతరం కామవరపుకోట గ్రామ పంచాయతీలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం

ఎంఎల్‌ఎ చింతమనేని

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ప్రజల సంక్షేమమే టిడిపి కూటమి ప్రభుత్వం లక్ష్యమని దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ అన్నారు. పెదవేగి మండలం దుగ్గిరాలలోని క్యాంపు కార్యాలయంలో పెదవేగి మండల పరిధిలోని పలు గ్రామాల పంచాయతీ అధికారులు, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జులు, పార్టీ గ్రామ అధ్యక్షులతో గురువారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సుదీర్ఘ కాలంగా ఆయా గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలు, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులపై గ్రామాల వారీగా సంబంధిత అధికారులు, నాయకులతో చర్చించారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది స్థానిక నాయకులు సమన్వయంతో కృషి చేయాలని చెప్పారు.

కలుషితంపై అధికారులతో నేడు ఎంఎల్‌ఎ సమీక్ష

ప్రజాశక్తి - ఉంగుటూరు

చేపల చెరువుల వల్ల మురుగునీటి అవుట్‌లెట్స్, మంచినీరు వెళ్లే ఇన్‌లెట్స్ బోదెలో చేపలకు మేతగా కోడి వ్యర్థాలను వేయడంతో గాలి, నీరు, వాతావరణం కలుషితం అవుతోంది. దీన్ని అరికట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ అమలు చేయనుంది. ఈ క్రమంలో ఉంగుటూరు ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని ఈ నెల 12వ తేదీ నారాయణపురం లయన్స్ క్లబ్ ఆడిటోరియంలో నిర్వహించనున్నారని ఎంపిడిఒ శర్మ వెల్లడించారు. నాలుగు మండలాలకు చెందిన తహశీల్దార్లు, ఎంపిడిఒలు, మత్స్య, రెవెన్యూ, ఇరిగేషన్, డ్రెయిన్స్, ఫారెస్టు, పోలీసులు, పంచాయతీ కార్యదర్శులు, విఆర్‌ఒలు హాజరుకానున్నారు.

మంత్రి కేశవ్‌ను కలిసిన హరినాథ్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తానని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ హామీ ఇచ్చినట్లు ఆంధ్రప్రదేశ్ పే, అకౌంట్స్ ఆఫీస్ (వర్క్స్ అకౌంట్స్) ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్.హరినాథ్ తెలిపారు. మంత్రి కేశవ్‌ను రాష్ట్ర సచివాలయంలో అసోసియేషన్ తరపున కలిసి శుభాకాంక్షలు తెలిపినట్లు చెప్పారు. ఈ సందర్భంగా డిపార్ట్‌మెంట్‌లో సమస్యలను మంత్రికి వివరించి, పరిష్కరించాలని కోరినట్లు చెప్పారు. దీనిపై మంత్రి స్పందిస్తూ ఉద్యోగుల సర్వీస్ మేటర్స్‌లో ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరిస్తానని, డిపార్ట్‌మెంట్‌లోని ఉద్యోగులు కూడా నిబంధనల ప్రకారం కష్టపడి పనిచేసి ప్రభుత్వ ఆదాయం కాపాడటంలో కృషి చేయాలని తెలిపారు.